జ్ఞప్తికి వస్తున్నాయి. సెకండు, ఫస్టు క్లాసులవాళ్ళతో తమ స్థితిని పోల్చుకుందుకు వీళ్ళకు కలేజా లేదు; థర్డుక్లాసువాళ్ళతో కరస్పర్శ చెయ్యడానికి వీళ్ళకి న్యూనత. ఈ ప్రమాదకరమైన స్థానం ఆక్రమించుకున్నాడు ఇంటర్ తరగతి ప్రయాణీకుడు. ఇతడియొక్క ఈ స్థితికి విమోచన కలగాలంటే బెర్నార్డుషా వర్ణించిన స్వర్గం అమలులోకి రావాలి. ఆస్వర్గంలో థర్డుక్లాసు రైలుపెట్టెలు లేవు. అంటే, ఇంటరూ, సెకండూ కూడా వుండవన్నమాట-ఉండేదల్లా ఒక్కటే తరగతికి ప్రస్తుతంలో ఆ తరగతి మరొకమాట కనిపించక 'ఫస్టుక్లాసు' అని అనాల్సివొస్తూంది.

---

# చేసినపాపం చెబితే పోతుందా?

చిన్నప్పట్నుంచీ మన పెద్దలు మనకు నూరిపోసే కాపీ పుస్తకపు నీతులలో ఇవొకటి-చేసిన పాపం చెబితే పోతుందట! ఏదైనా ఒక పాపిష్టి పనినిచేసి, పదిమందితోనూ 'ఇది ఇలా చేసేనర్రా, నా మొహం మండా!' అని చెబితే ఆ చేసిన పాపం పటాపంచలై పోతుందట. అంతటినుంచీ మళ్ళీ పామేదాలాగ తిరగవచ్చునట. ఇలాగ మనం ఎన్ని పాపాలైనా చేయవచ్చు. ఆ పాపాలనుండి విముక్తి చెందవచ్చు. దొంగతనం చెయ్యండి, పక్క ఇంటివాడి పెళ్ళాన్ని లేవగొట్టండి, దారికాసి ఖూనీచేయండి. ఏదైనాచేయండి. చేయడం తడవుగా ఇలా చేసేనని నలుగురితోనూ చెప్పేస్తే ఆ పాపం పోతుంది. ఎంత సులువుగా వుంది ఈ అరేంజిమెంటు!

చేసిన పాపం చెప్పినంత మాత్రాన పోయేమాటైతే చేసిన పుణ్యానికి గిట్టుబాటు బహు తక్కువగా వుండాలి. ఈ కొలమానంతో కొలిచి చూస్తే పాపం చేసినవాడి స్థితీ, పుణ్యం చేసినవాడి స్థితీ రమారమి ఒకలాగనే వుంటుంది-చేసినపాపం చెబితే పోతుంది కాబట్టి అంతాకూడా తాము చేసిన పాపాలను వెల్లడిచేసి పాపాత్ములనే పేరునుండి తప్పించు

ఉంటారు. ఒకడు పాపాత్ముడెవ్వడైతే కాడో అతడికీ పుణ్యాత్ముడికీ మధ్యవుండే పరదా తొలగిపోతుంది. వెరశి : పాపాలు చేయకుండా వుండటానికి ఎన్నో ప్రయత్నాలుచేసి, అన్నీ పుణ్యాలే చేయడానికి ఎంతో కష్టపడి, పుణ్యాత్ముడనిపించుకున్నవాడూ, ఇట్టే ఇట్టే పాపాలుచేస్తూ, చేసేనని చెప్పేసి పాపవిముక్తిని పొందినవాడూ యిద్దరి గమ్యస్థానం రమారమీగా వొక్కటే! మరి, ఎందుకయ్యా ఒకడు సులువుగా పాపాలను చేసి తప్పించుకుంటూంటే రెండోవాడు కంటక ప్రాయమైన పుణ్యమార్గాన్ని అనుసరిస్తాడు?

అయితే గియితే పాపమనేదే వుంటే దాన్ని ఎవడైనా చేయడం తటస్థిస్తే అది చెప్పినంతమాత్రాన పోతుందా అని? అన్ని మతాలలోనూ పాపానికీ తగిన శిక్షను, ప్రాయశ్చిత్తాన్ని ఏర్పాటుచేసే వుంచారు. ఇంతే గాకుండా, పాపానికి తగిన శిక్షలు అమలులో వుంటూండగా మళ్ళీ ప్రతి మతంవారికీ ఒక మెట్ట వేదాంతం ఒకటి ఏడిసింది. ఆ మెట్ట వేదాంతమే 'చేసిన పాపం చెబితే పోవడం'. ఇది అందరి మత సాంప్రదాయాలలోనూ కనిపించడమే కాకుండా క్రైస్తవులు మొదలైనవారు ఈ సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చారు. బ్రతికివుంటే కాలంలో చేసిన పాపాన్ని చెప్పడానికి కొంతమంది మొహమాటపడతారు గాబట్టి చచ్చేటప్పుడు, అంతిమావస్థలో పూజారిచెవిలో చేసిన పాపాలనన్నిటిన్నీ కక్కేస్తే పాపవిముక్తుల మవుతమని క్రైస్తవుల నమ్మకం. ఇది కేవలం సూత్రప్రాయమైన నమ్మకమేగాని దీన్ని నైతిక శాసనకర్తగా ఎవరూ భావించరు. అలా భావించేమాటైతే, మతాలూ, ప్రభుత్వాలూ నిర్ణయించిన శిక్షలకూ, న్యాయస్థానాలకూ అర్థంలేదు.

దీనికి సంబంధించిన వింతగాథ ఒకటి అమలులో వుంది - ఒక క్రైస్తవుడు చనిపోతున్నాడు. మత సాంప్రదాయాల ప్రకారం అతడి మరణశయ్యవద్దకు ఒక మతగురువును తీసుకువచ్చారు. చనిపోయేవాని నుద్దేశించి ఆయన అన్నాడు: 'నాయనా! నువ్వు జీవితంలో చేసిన

పాపాలన్నీ నాతో చెబితే నువ్వు పాపరహితుడవై నువ్వు వెళ్ళే మార్గం తిన్నబడుతుంది' అని.

'సరే, వినండి చెబుతా' అని ఆ చనిపోతూండే వ్యక్తి ప్రారంభించాడు-'అయిదారేళ్ళ క్రితం నేనొక గొప్ప పాపంచేశాను. నాజీవితంలో నేను చేసిన పాపా లన్నిట్లోనూ ఎన్నదగినది అది వొక్కటే-'

'ఏమిటి నాయనా అది? చెప్పు-నిర్భయంగా చెప్పు-నువ్వు వెళ్ళే మార్గం తిన్నబడుతుంది' అన్నాడు మతగురువు.

చనిపోయే వ్యక్తి మళ్ళీ ప్రారంభించాడు-

'అయిదారేళ్ల క్రితం మీ సతీమణి లేచిపోయిన సంగతి మీరు మరవలేదనుకుంటాను, ఆమెను లేవదీసుకెళ్ళింది ఎవరనుకున్నారూ? నేను-ఈ పాపి-నన్ను క్షమిస్తారా?'

మతగురువు స్తంభించిపోయాడు-కోపం, ఆవేశం అతడి తాత్కాలిక ప్రశాంతిని చెరిచాయి. అతడు మండిపడుతూ చనిపోయేవానితో అన్నాడు-'చెప్పినంతమాత్రాన పాపాలు విరగడైపోవు-అదీ వట్టి దొంగ మాట అని ఈనాటికి తెలుసుకున్నా. నీ పాపానికి ప్రాయశ్చిత్తం కఠినమైనదిగా వుండాలి-' అని.

పాపమనేది వున్నదనీ, దానికి కఠినశిక్ష వుండాలనీ వాదించేవాళ్లకు నేను సానుభూతి చూపను. నిజానికి, చేసినపాపం చెబితే పోతుంది అనే సిద్ధాంతం కేవలం మానసికంగా వుండిపోకుండా యదార్థంగా ఆచరణలోకివస్తే అందరికన్నా ముందుగా దాన్ని ఆహ్వానించేది నేనే. కాని, యదార్థాలు వేరుగా వుంటున్నాయి ప్రపంచంలో-చేసిన పాపాలకేగాకుండా చేయని పాపాలకుకూడా కఠినశిక్షలు విధించబడటం నేడు మనం ప్రతిచోటా చూస్తూండేదే. చేసినపాపం చెప్పినంత మాత్రాన ఎక్కడా పోవడంలేదు.

అలాపోయేమాటైతే ఈ జైళ్ళూ సంకెళ్ళూ, ఉరిస్తంభాలూ, చిత్రవధలూ ఎందుకూ?

చెయ్యని పాపాలే మనుష్యుల్ని వెంటాడే ఈ రోజుల్లో చేసిన పాపాలు చెప్పేవరకూ బయలుపడవనుకోవడం అర్థంలేని మాట. ఫలానావాడు దొంగ అని అనుమానింపబడి, తీర్మానింపబడి, వాడికి తన్నులు తగలడమే వాడు పాపి అనీ, శిక్షార్హుడనీ ధృవపరుస్తుంది. ముందుగా ఈ శిక్షాకాండ అంతా జరుగుతుంది. ఆ తర్వాత, శిక్షించే వారి మానసికతృప్తికోసమై ఫలానావాడిని న్యాయంగానే శిక్షించాం అనే నైతిక ధీమాకోసమై, శిక్షాపాత్రుని నోటివెంట నే 'నేను పాపినే' అని అనిపించడం-కొన్నికొన్ని సందర్భాలలో నిజంగా పాపి కాక పోయినా, లాఠీ దెబ్బలకు జడిసైనా 'నేనే పాపిని' అని అనవలసి రావడంకూడా అప్పుడప్పుడు జరుగుతూనే వుంటుంది. వెరశి: చేసిన పాపం చెప్పకముందే దేహశుద్ధితో పటాపంచలై పోతుంది. ఇంక వేరే చెప్పడంకూడా ఎందుకయ్యా అంటే చెప్పించే ప్రభువుల ఆత్మతృప్తి కోసమై!

---

## కెరడుగట్టిపోయిన మనిషి

'రామ్మోహన్రావుకోసం వచ్చారా? ఇంట్లో లేడు. హోటలుకు వెళ్ళాడు భోజనానికి. కూర్చుంటే కూర్చోండి అతడు వచ్చేదాకా.'

'అలాగేలెండి, కూర్చుంటా-మీరూ అతనూ కలిసి ఈ ఇంట్లో వుంటున్నారా?'

'అన్నమాటేనండి, మీరుకూడా రామ్మోహన్రావు పనిచేసే కంపెనీలోనే పని చేస్తున్నారా?'

'అవునండి. అతడితో కొంచం పనివుండి వచ్చా.'

'కూర్చోండి— వస్తాడు. మీ పేరు?'

'కృష్ణమూర్తి—'

'అలాగా? నీరసంగా కనిపిస్తారేం?'

'ఒంట్లో అట్టే బాగులేదండి.'